Andhra Jyothi

# గ్రూప్-2కు 8 లక్షల దరఖాస్తులు

**పాత నోటిఫికేషన్ లో 5,62,715, సప్లిమెంటరీలో 2,29,249.. అత్యధికంగా కరీంనగర్ నుంచి.. 1.15 లక్షలు**

- అత్యల్పంగా మెదక్ నుంచి 56వేలు
- ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల నుంచీ వెల్లువ
- అండమాన్ నుంచి 7 దరఖాస్తులు




హైదరాబాద్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రూప్-2 ఉద్యోగాలకు తీవ్ర పోటీ నెలకొంది. టీఎస్‌పీఎస్సీ ప్రకటించిన 1032 గ్రూప్-2 పోస్టులకు దాదాపు 8లక్షల దరఖాస్తులు వచ్చాయి. పాత, కొత్త నోటిఫికేషన్లకు సంబంధించి మొత్తం 7,91,964 అప్లికేషన్లు వచ్చాయి. ఇందులో గత నోటిఫికేషన్ దరఖాస్తులు 5,62,715 ఉండగా.. సప్లిమెంటరీ నోటిఫికేషన్ లో 2,29,249 దరఖాస్తులు అందినట్లు టీఎస్‌పీఎస్సీ అధికారులు తెలిపారు. గ్రూప్-2 దరఖాస్తుల స్వీకరణ గడువు సోమవారం (26వ తేదీ)తో ముగియడంతో దరఖాస్తుల సంఖ్యను టీఎస్‌పీఎస్సీ మంగళవారం వెల్లడించింది. 2015 డిసెంబరు 30వ తేదీన 439 పోస్టుల భర్తీకిగాను టీఎస్‌పీఎస్సీ గ్రూప్-2 నోటిఫికేషన్ ను జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే పోస్టులు తక్కువ సంఖ్యలో ఉండడంతో పెంచాలని నిరుద్యోగుల నుంచి డిమాండ్ వ్యక్తమైంది. ఈమేరకు ప్రభుత్వం గ్రూప్-2 పరీక్షను వాయిదా వేసి అదనంగా 593 పోస్టులను మంజూరు చేసింది. దీంతో టీఎస్‌పీఎస్సీ ఈనెల 1వ తేదీన సప్లిమెంటరీ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తంగా 1032 పోస్టులకు నవంబరు11, 13 తేదీల్లో పరీక్ష నిర్వహిస్తారు. కాగా గ్రూప్-2 నోటిఫికేషన్ కు తెలంగాణ, ఏపీతో పాటు ఇతర రాష్ట్రాలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి కూడా దరఖాస్తులు అందాయి. తెలంగాణను మినహాయిస్తే.. ఏపీ, బీహార్, ఢిల్లీ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తమిళనాడు.. ఇలా ఇతర రాష్ట్రాల నుంచి ఏకంగా 23,628 దరఖాస్తులు అందడం గమనార్హం. వీటిలో ఏపీ నుంచి 11,346 దరఖాస్తులు ఉన్నాయి. అండమాన్ నికోబార్ నుంచి ఏడు, జమ్మూ కశ్మీర్ నుంచి 14 దరఖాస్తులు రావడం విశేషం. తెలంగాణలో అత్యధికంగా కరీంనగర్ జిల్లా నుంచి 1,15,315, అత్యల్పంగా మెదక్ నుంచి 56,042 దరఖాస్తులు అందాయి. కాగా గ్రూప్-2 అభ్యర్థులకు మన టీవీ ద్వారా నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. ఈమేరకు విద్యార్థులు, నిరుద్యోగులు, గృహిణులకు ఉపయోగపడే విధంగా మన టీవీలో కార్యక్రమాల కోసం ఇస్రోతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోనుంది.

### జిల్లాల వారీగా..

| జిల్లా | దరఖాస్తులు |
|---|---|
| ఆదిలాబాద్ | 60977 |
| హైదరాబాద్ | 63170 |
| కరీంనగర్ | 115315 |
| ఖమ్మం | 70963 |
| మహబూబ్‌నగర్ | 81938 |
| మెదక్ | 56042 |
| నల్లగొండ | 104869 |
| నిజామాబాద్ | 48015 |
| రంగారెడ్డి | 60121 |
| వరంగల్ | 106930 |
| తెలంగాణేతర రాష్ట్రాలు | 23628 |
| మొత్తం | 7,91,964 |